

# కళ్యాణతిలకం

## _కోసూరి ఉమాభారతి



(ప్రారంభం)

*వివాహ వేడుక విధివిధానంలో పాటించవలసిన సాంప్రదాయాలు, ఆచారాలతో పాటు 'వధువు అలంకరణ' కూడా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. బ్రహ్మస్థానమైన నుదిటి పై వివాహిత ప్రతిదినం కుంకుమ దిద్దితే.. భర్త ఆయుష్షు పెరుగుతుందని, శుభాలు కలుగుతాయని చెబుతుంది మన సంస్కృతి.*

*ఆచార సాంప్రదాయాలని అనుసరించి పాణిగ్రహణ సమయంలో ఉచ్ఛరించిన పెళ్లి ప్రమాణాలు పదికాలాల పాటు నిలబడతాయని, వైవాహిక జీవితం అన్యోన్యంగా సాగుతుందని సూచిస్తుంది మన సాంప్రదాయం.*

★★

*విభిన్న కుటుంబ నేపథ్యాల నుండి భిన్న మనస్తత్వాలు కలిగి ఉన్న ఐదుగురు అమ్మాయిల గురించి, వారి నడుమనున్న మైత్రి బంధం గురించి, వారి ఆశలు, ఆశయాల గురించి సాగుతుంది **'కళ్యాణతిలకం'** నవల లోని కథనం.*

*వారి వైవాహిక జీవితాల్లోని ఆనందాలు, వైఫల్యాలు, అరమరికలు, అనురాగాల గురించి సాగుతుంది ఇతివృత్తం*

*ఒకరిది తీర్చలేని వ్యధ, ఒకరి జీవితం ఆనందాల డోలిక, ఒకరి కాపురం కష్టాల కాష్టం, మరొకరిది నిత్యవసంతం గా సాగే సంసారం, వేరొకరికి 'కళ్యాణం' కరిగిపోయే కల.*

*ఐదుగురు అతివల జీవన గాథలని ప్రతిభింబించేదే 'కళ్యాణతిలకం' నవల.*

1

**ఉద్యోగరీత్యా నాన్న గారి** బదిలీ వల్ల చెన్నై నుండి సికందరాబాద్ చేరాము. రైల్వే వారు అనువైన వసతి కేటాయించే వరకు శ్రీధర్ మామయ్య ఇంట ఉండబోతున్నాము. ఆయన భార్య పేరు అనురాధ. అమ్మావాళ్ళకి ఆయన దూరపు బంధువట. మా నాన్న గారి పేరు శివరాం అయితే.. 'ఏరా శివా' అంటూ చనువుగా మామయ్య, అమ్మ పేరు కస్తూరి అయితే 'కస్తూరమ్మా' అని ప్రేమగా అత్తయ్య పలకరించుకోడం ముచ్చటగా అనిపించింది.

వాళ్ళ కూతురు, పదిహేనేళ్ళ 'వందన తో త్వరగానే మంచి స్నేహం ఏర్పడింది. రకరకాల హెయిర్–స్టైల్స్ చేయడం తెలిసుండడంతో, వందనకి రోజుకో రకం హెయిర్–స్టైల్ చేస్తూ తనకి దగ్గరయ్యాను. నన్ను 'ప్రియసఖీ' అని పిలువసాగింది వందన. నా తమ్ముడు వంశీతో కూడా క్రికెట్ ఆడుతూ సరదాగా ఉంటుంది.

తన స్నేహితులకి నన్ను పరిచయం చేస్తూ.. "తాను నా కజిన్ కళ్యాణి. ఇప్పుడు నా డియర్ ఫ్రెండ్. చెన్నైలో వాళ్ళ నాన్నమ్మ ఒక పేరున్న బ్యూటీషియన్. ఓ సంగీతకారిణి కూడా. ఆమె వద్ద తర్ఫీదు పొందింది కళ్యాణి. 'బ్రైడల్–మేకప్' లో ఆన్–లైన్ కోర్సులు తీసుకుంటుంది. నా ఈ ప్రియసఖి చక్కగా పాడుతుంది కూడా." అంటూ వందన గొప్పగా చెబుతుంది.

నిజమే, నానమ్మ చెన్నైలో పేరున్న బ్యూటీషియన్. ప్రత్యేకించి 'వధువు అలంకరణ' చేయడంలో దిట్ట. 'కాదంబరి ఫ్లవర్స్' పేరిట వధూవరుల జై మాలలు, ఆలయాలకి పూలమాలల తయారీ ఆమె వ్యాపారం. చిన్నప్పటి నుండి నానమ్మ వద్ద 'స్త్రీ అలంకరణ' తో పాటు, సంగీతం, కవిత్వం రాయడం కూడా నేర్చుకున్నాను.

★★

వందన పుట్టినరోజుకి తనకిష్టమైన పైన్–ఆపెల్ కేక్ అమ్మ, నేను ఇంట్లోనే చేసాము. అభిమానం వ్యక్తపరిచేందుకు ఓ కవిత రాశాను.

*||నీవు నేను –ఒకే ఆకాశంలో రెండు తారలు, ఒకే వెలుగు మార్గంలో వేర్వేరు వెలుగులు*
*స్నేహం అంటే మాటల మేళవింపు కాదు, మనసుల మెలకువ, నమ్మకపు నెమలి రెక్క*
*నిజమైన మన స్నేహం పుష్పంలా పరిమళించే బంధం.*
*కాలం మారినా, దూరం పెరిగినా, మిగిలేది మన బంధమే ||*

అని రాసిన కవిత చదివి వినిపించి, కేక్ కోయించినప్పుడు కన్నీళ్ళ పర్యంతమైంది వందన.

★★

మొత్తానికి అలా వందన వాళ్ళింట రెండు నెలల వేసవి సెలవలు సరదాగా గడిచిపోయాయి. స్కూళ్ళు తెరిచే లోగానే సికందరాబాద్ లోని రైల్వే క్వార్టర్స్ లోకి మారాము.

'శ్రీ విద్య గర్ల్స్ హైస్కూల్లో' పదవ తరగతిలో చేరాను. సెయింట్–పాట్రిక్స్ బాయ్స్ కాన్వెంట్' లో ఆరవ తరగతిలో వంశీ చేరాడు.

★★

స్కూల్ ఒకటే అయినా, వందన నాకు సీనియర్ అవడంతో స్కూల్లో పలకరింపులతో సరిపోయేది.

ఢిల్లీ ఐ.ఐ.టీ లో ఇంజినీరింగ్ చేయాలని ఇప్పటినుండే పట్టుదలగా చదువుతుంది వందన. వారింట ఆమె ఓ యువరాణి. నేనేమో ఇంటా, బయటా కూడా ఒదిగి ఉంటాను. భిన్నధృవాల వంటి మా నడుమ అరమరికలు లేని స్నేహం కుదరడం విశేషమే అనిపిస్తుంది.

★★

స్కూల్ నుండి మా ఇల్లు పెద్ద దూరం కాకపోవడంతో నడిచే వెళ్ళి వస్తున్నాను. ఓ శుక్రవారం పొద్దుట తుప్పర పడుతున్నా పట్టించుకోకుండా స్కూల్ కి బయలుదేరాను.

తీరా వెళ్ళాక, వందన తో సహా చాలామంది స్కూలుకి రానేలేదని తెలిసింది. కొద్ది గంటల్లోనే, 'వాతావరణం ఉధృతంగా మారగలదంటూ క్లాసులు కాన్సిల్ అవడంతో తిరిగి ఇంటిదారి పట్టాను.

నిర్మానుష్యంగా ఉన్న మార్గంలో వెనుక నుండి వేగంగా వచ్చిన ఓ సైకిల్ నన్ను గట్టిగా 'ఢీ కొట్టడంతో.. నిలదొక్కుకోలేక పక్కకి ఒరిగిపోయాను.

కళ్ళు బైర్లుకమ్మాయి. నా చేతులు, మోచేతులు, దోసుకుపోయి రక్తసిక్తమయ్యాయి. నా పసుపురంగు వోణీ పై మట్టిమరకలు. వెనుక నుండి ఇదంతా చూస్తున్న ఇద్దరమ్మాయిలు పరుగున వచ్చి, నాకు సాయం చేసారు. ఆ సైకిల్ వెధవని తిట్టిపోస్తూ నా దుస్థితికి నొచ్చుకున్నారు.

"మేముండేది ఎదురుగా ఉన్న 'దివ్యతేజ కాలనీ లో. మా ఇంటికి వచ్చి వోణీ మార్చుకుని, కాసేపు కూర్చుని వెళ్ళచ్చు." అంటూ వారిలో ఓ అమ్మాయి నాచేయి పుచ్చుకుని మెల్లగా నడిపించసాగింది.

"నీ పేరు కళ్యాణి కదూ! క్లాసులో అటెండెన్స్ చెప్పినప్పుడు తెలిసిందిలే. మనం క్లాస్-మేట్స్ అన్నమాట. నా పేరు ఊర్మిళ. తన పేరు మాళవి. చిన్నప్పటి నుండీ కలిసి చదువుకున్నాము. బెస్ట్ ఫ్రెండ్స్ అనుకో. ఆమెని నేను మాలీ అని పిలిస్తే.. తాను నన్ను ఉర్మీ అని పిలుస్తుంది. ఇంతకీ మీ ఇల్లెక్కడ?" అడిగింది ఊర్మిళ.

అక్కడి నుండి మరో పదినిముషాల నడకేనని చెప్పాను.

★★

ఆనాడు అలా పరిచయమయిన వారివురి తోనే కాదు. మా క్లాస్ లో కొత్తగా చేరిన మరో అమ్మాయి లియానా తోనూ మంచి స్నేహం ఏర్పడింది. లియానా అందరిలా కాదు. జంట నగరాల్లో పేరున్న టీనేజ్ మోడెల్. వర్ధమాన నటి. అప్పుడప్పుడు తన మోడెలింగ్ కి నేను చేసే హెయిర్-స్టైల్స్ తనకి నచ్చాయి. తన వీడియో షూట్ లకి నాతోనే అలంకరణ చేయించుకుని పారితోషికం అందిస్తుంది కూడా.

నేనో 'మంచి మేకప్ ఆర్టిస్ట్, హెయిర్-స్టయిలిస్ట్ నని ఊర్మిళ, మాళవి అందరికీ గర్వంగా చెబుతుంటారు. లియానా తో సహా నలుగురం చదువుల్లో ఫస్ట్.

★★

మూడేళ్ళ సమయం హాయిగా గడిచిపోయింది. అకడమిక్ స్కాలర్షిప్ తోనే జూనియర్ కాలేజీ చదువు పూర్తి చేసిన నాకు, మూడేళ్ళ డిగ్రీ చదువుకి కూడా 'ఉన్నత విద్యా కమీషన్' వారి గ్రాంట్ మంజూరవడంతో పాటు తమ్ముడు వంశీ హైస్కూల్ చదువుకి మెరిట్ గ్రాంట్ అందడం అమ్మానాన్నలకి చాలా ఆనందానిచ్చింది. మా చదువుల దృష్ట్యా ఇకపై మమ్మల్ని హైదరాబాదు నుండి కదిలించనని అన్నారు నాన్న.

★★

నేను డిగ్రీ కాలేజీలో చేరనున్నాను. ఢిల్లీలో వందన ఇంజినీరింగ్ రెండవ సంవత్సరంలో చేరనుంది. మా ఇరువురి మైత్రి ఆత్మీయంగా కొనసాగుతూనే ఉంది. వేసవి సెలవల్లో తాను హైదరాబాద్ వచ్చినప్పుడు నాలుగేసి రోజులు తనతో గడుపుతాను. కాలేజీలో తన స్నేహం కోసం పాకులాడే కుర్రవాళ్ళ గురించి, పెళ్లి ప్రపోజ్ చేస్తున్న మరికొందరి గురించి కూడా కబుర్లు చెబుతుంది. కానీ తాను మాత్రం తల్లితండ్రుల ఇష్టప్రకారమే పెళ్ళాడుతానని కూడా అంటుంది.

★★

ఎప్పటిలా వేసవి సెలవల మొదట్లోనే చెన్నై వెళ్ళి నానమ్మ వద్ద నాలుగు రోజులు గడిపి తిరిగొచ్చాక, మాళవి వాళ్ళ బాబాయి గారి 'శిశు సంక్షేమ సంస్థ' లో మాళవి తో పాటు ఊర్మిళ, నేను కూడా వాలంటరీ వర్క్ చేస్తున్నాము.

లియాన మాత్రం 'ఫెమినా' వారి 'అందాల పోటీ' లో మొదటి స్థానం లో గెలుపొంది ఉన్నట్టుండి తారపథం లోకి దూసుకుపోయింది. దాంతో.. వరసగా వచ్చిన సినిమా అవకాశాలని అందిపుచ్చుకుని, రెండు సినిమాల్లో హీరోయిన్ గా నటించేందుకు.. షూటింగ్ కి కేరళ వెళ్ళిపోయింది.

టాప్ స్టూడెంట్స్ లో ఒకరైన లియానా చదువుకి, తనతో మా స్నేహానికి అలా ఆటంకం ఏర్పడింది.

★★

సెలవులు త్వరగానే ముగిసి, తమ్ముడు 'సెయింట్ జోసెఫ్ కాన్వెంట్' తొమ్మిదవ తరగతి లో చేరాడు.

నేను, నా స్నేహితురాళ్ళు ఊర్మీ, మాళవి కూడా డిగ్రీ చదివేందుకు హైదరాబాద్ లోని 'శ్రీవాణి స్త్రీల కళాశాల' లో చేరాము. ముగ్గురం నిత్యం కలిసే ఉంటామని.. కాలేజీలో మమ్మల్ని 'తీన్ దేవియా' అని పిలవసాగారు. "భలే పేర్లు, భలే అమ్మాయిలూ" అంటూ వ్యాఖ్యానిస్తారు కూడా.

మా తెలుగు లెక్చరర్ మాత్రం.. "ఏమ్మా! ముగ్గురూ ఆ వెనుక బెంచీలపై జేరి నిత్యం ఇకఇకలు, పకపకలు. చదువుకోడానికి వస్తున్నారా? లేక మీ స్నేహబంధాన్ని పెంచి పోషించడానికే కాలేజీకి వేంచేస్తున్నారా? క్లాసు బయటకి వెళ్ళాక కబుర్లు చెప్పుకోండి." అంటూ మమ్మల్ని తరచుగా మందలిస్తారు.

★★

అలా మా డిగ్రీ చదువు కూడా సందడిగా, సరదాగా ముగిసి ఫైనల్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. మేము పట్టభద్రుల మవుతుంటే, వందన ఇంజనీరింగ్ పూర్తి చేయనుంది.

★★

ఆఖరి పరీక్షకి ముందు కాలేజీ ఆవరణలో, మర్రి చెట్టు క్రింద అరుగు వద్ద చేరాము. ఊర్మిళ మాత్రం ఎప్పటిలా అరుగు మీద కూర్చుని సినిమా పత్రిక చదవడంలో మునిగిపోయింది. కాసేపటికి "ముఖ్యమైన ప్రకటన అందరూ వినాలి!" అంటూ చేయి పైకెత్తి స్వరం పెంచింది.

"మన ఫ్రెండ్.. నటి లియానా కొత్త చిత్రం **'రోమియో–జూలియెట్'** గురించిన తాజా వార్త! ఆ సినిమా లో 'రొమాంటిక్ సీక్వెన్స్ కోసం కుస్తీ క్రీడల్లో పాల్గొన్న లియానా గాయపడడంతో.. వారంపాటు షూటింగ్ నిలిపి వేసారు. దాంతో, ఈ రొమాంటిక్ చిత్రాన్ని దీపావళి కానుకగా అందించగలమో లేదో అని ఆందోళనలో ఉన్నారు నిర్మాతలు." అని పత్రిక మూసి పక్కన పెట్టింది.

మా వంక చూసి పెద్దగా నవ్వుతూ.. "అయినా, సినిమాల్లో రొమాన్స్ పేరిట కుస్తీ క్రీడలేమిటి? చాలా స్టుపిడ్." అంది ఊర్మిళ.

అక్కడ చేరిన జూనియర్ స్టూడెంట్స్ తో పాటు అంతా నవ్వుకున్నాము. సినిమా పత్రికల్లోని తాజా వార్తలని ఇలా మాకు ఎప్పటికప్పుడు అందిస్తుంది మా ఊర్మిళ.

అక్కడే ఉన్న మా జూనియర్, ఉమ వెనుతిరిగి మా వైపు చూసింది. "హలో 'తీన్ దేవియా! సినిమాల్లో రొమాన్స్ చిత్రీకరణ గురించే అంతలా వాపోతే ఎలా? 'వసంతం' అనే డబ్బింగ్ సినిమా చూసారా? భయంకరుడైన ఓ భర్త, బాగా తాగేసి ఫుట్–బాల్ ని తన్నినట్టుగా భార్యని కాలితో తన్నడం చూపారు. హౌజ్–ఫుల్ గా నడుస్తుంది ఆ పిచ్చి సినిమా. ఆడపిల్లల్ని బలహీనులుగా, మగవాళ్ళ చేతుల్లో ఆటవస్తువుల్లా చిత్రీకరించడాన్ని.. ప్రతిఘటిస్తూ నేను ఒక ర్యాలీ నిర్వహించబోతున్నాను." అంది ఆవేశంగా.

నా చేతి పై గిల్లింది పక్కనే ఉన్న మాళవి. "ఈ జూనియర్ ఒక ఆడపులి అనుకో!" అంది నా చెవిలో. తన మాటలకి నవ్వుతూనే పరీక్ష గుర్తొచ్చి పుస్తకం తెరవబోయాను.

"అది సరే గాని, ఆమధ్య పెళ్లి చేసుకొన్న మా కజిన్ శాలిని గురించి ఓ కబురు చెప్పాను. గుర్తుందా?" అని అడిగింది మాళవి ఉన్నట్టుండి. ఊర్మీ, నేను కూడా తలెత్తి .. ఏ విషయం అన్నట్టుగా చూసాము.

"అదేనోయ్! కాపురానికి వెళ్ళిన మూడు నెల్లకే తిరిగి పుట్టింటికి వచ్చేసిన అమ్మాయి." అంది మాళవి

"అవునవును.. గుర్తొచ్చింది. ఏమయింది ఆ తరువాత? విరహం ఓపలేక ఆ అమ్మాయి భర్త వద్దకు చెక్కేసిందా? చెప్పు చెప్పు." అంటూ అరుగు దిగి మా మధ్యకొచ్చి కూర్చుంది ఊర్మిళ.

“కానే కాదు. భర్త ఆమడ దూరంలో ఉన్నా సహించలేను.’ అంటూ సీరియస్ గానే విడాకులకి  కోర్టు కి వెళ్ళింది.” అని మాళవిక చెపుతుంటే  విని నేను, ఊర్మీ కూడా ఆశ్చర్యపోయాము.

“..అయినా ఆమె అలా విడాకుల నిర్ణయం తీసుకోడానికి కారణం ఏమై ఉంటుందంటావు? ఆమె  భర్త కూడా ‘వసంతం’ సినిమాలో హీరో లా భయంకరుడేమో? ఆరా తీయాలి.” అంది ఊర్మీ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS